క్లుప్తంగా

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించండి

ఘట్‌కేసర్: పట్టణంలోని గట్టుమైసమ్మ అమ్మవారి ఆలయం వెళ్లడానికి జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి బాబుచారి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం తిరగాల్సి వస్తుందని, ఆలయానికి వెళ్లే సమయంలో బైపాస్ రోడ్డు దాటే క్రమంలో భక్తులకు గతంలో గాయాలయ్యాయన్నారు. అలాగే పట్టణం నుంచి మైసమ్మగుట్ట కాలనీకి వెళ్తుండగా ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

మేడ్చల్: వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నందున కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మేడ్చల్ ఎస్‌ఐ మురళీధర్ అన్నారు. పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లోని శ్రీకాలనీవాసులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇళ్లల్లో ఎట్టి పరిస్థితుల్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును పెట్టుకోవద్దని, బ్యాంకు లాకర్లలో పెట్టాలని, అదే విధంగా బైక్‌లకు జీపీఎస్ ట్రాకింగ్ చిప్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్ జంగ హరికృష్ణ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ శ్రీరమాసత్యనారాయణ స్వామి, షిర్డీ సాయిబాబా దేవస్థానం (శ్రీసత్యనారాయణ సేవా సమాజం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16వ వార్షిక చలివేంద్రంను బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య, ఆలయ కమిటీ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, కౌన్సిలర్లు సుమిత్రసురేష్, ముత్యాలు, సభ్యులు చంద్రోశేఖర్, రామచందర్, బిక్షపతి, వాడేపల్లి శ్రీనివాస్, హరగోపాల్, వెంకటేశ్వరరావు, రమేష్, సుధాకర్, రంగారావు, భూపాల్‌రెడ్డి, నాగరాజు, మహేందర్‌రెడ్డి, నగేష్, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో క్రీడా సామగ్రి ప్రారంభం


ఆట వస్తువులను ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ 5వ వార్డులో కేఎస్ఆర్, అరుంధతి కాలనీల కామన్ పార్కులో చిన్నపిల్లల కోసం సవిత్ అనే వ్యక్తి సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రిని స్థానిక బీఆర్ఎస్ నేత కొత్త భాస్కర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నానునాయక్, నాయకులు పాండుగౌడ్, రాజుముదిరాజ్, నాగేశ్వర్‌రెడ్డి, సవిత్, సంజీవ, శివరెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పర్వదినం

షడ్రుచుల సమ్మేళనం

- మేడ్చల్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో శోభకృత్ నామ సంవత్సర వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగ శ్రవణాన్ని వినిపించిన వేద పండితులు

శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం మేడ్చల్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ వైభవం ఉట్టిపడేలా హిందువులంతా సంప్రదాయ దుస్తులు ధరించి ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అనంతరం పులుపు, కారం, ఉప్పు, తీపి, చేదు, వగరు వంటి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, భక్షాల వంటి పిండి వంటలు చేసి ఇష్టదేవుళ్లకు నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్నేహితులకు, బంధువులకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం వేళల్లో ఆలయాల వద్ద అర్చకులు చదివిన పంచాంగాన్ని భక్తితో కూర్చొని విన్నారు.

\- మేడ్చల్ జోన్ బృందం


కీసర: కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డికి ఆయన కుటుంబ సభ్యులకు వారి నివాసంలో ఆశీర్వచనాలు అందజేస్తున్న కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ వేదపండితులు. చిత్రంలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, రవిశర్మ తదితరులు.


మేడ్చల్: గౌడవెల్లి గుడిబండ ఆలయంలో..


మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ హనుమాన్ ఆలయంలో పంచాంగాన్ని వినిపిస్తున్న వేదపండితులు


పోచారం: అన్నోజిగూడలోని అయ్యప్ప ఆలయంలో వినిపిస్తున్న పంచాంగ శ్రవణంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు, పుర పెద్దలు


ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, సంతోశ్‌కుమార్‌గౌడ్, బాబురావు, స్థానికులు


జవహర్‌నగర్: అమ్మవారికి హారతి ఇస్తున్న కార్పొరేటర్లు


జవహర్‌నగర్: చెన్నాపురం బీరప్ప ఆలయంలో పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కార్పొరేటర్లు

వైభవంగా సీతారామచంద్ర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు


వేడుకలో మంత్రి మల్లారెడ్డి తనయుడు డాక్టర్ భద్రారెడ్డి తదితరులు

కీసర: కీసర శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజైన బుధవారం ఆలయం వద్ద గురువందనంతో పాటు శాంతిపాఠం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగశాలప్రవేశం, ఉదయం 10 గంటల సమయంలో పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా మంత్రి మల్లారెడ్డి తనయుడు డాక్టర్ భద్రారెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురి, ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు తటాకం నారాయణణ, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు పన్నాల బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బవర్‌లాల్, రాయిల శ్రవన్‌గుప్తా, చిత్తార్ల రమేష్‌గౌడ్, జూపల్లి రవీందర్, మోహన్‌లాల్, గుర్రం మల్లారెడ్డి, రమేష్‌గుప్తా, శంకర్‌గౌడ్, ఆనబోయిన జంగయ్య, మోర రవికాంత్, శీలం శ్రీనివాస్, మల్లేష్, తదితరులు వేడుకలో పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తుల ఊరేగింపులో..

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ పూజలు


పూజల్లో మాజీ ఎమ్మెల్యే దంపతులు, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం గుబ్బరిగుట్ట మైసమ్మ, ఎల్లమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు, సర్పంచ్ శివశంకర్ అమ్మవారికి పూజలు చేశారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ అంకురార్పణం, అఖండ దీపస్థాపనం, అగ్ని ప్రతిష్ఠ మండప సంస్కారం, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

పోచారం: పిల్లలు కొత్త విషయాలు తెలుసుకునేందుకు గ్రాండ్ పేరెంట్స్ ఎంతగానో తోడ్పడతారని కౌన్సిలర్ గొంగళ్ల మహేష్ అన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని శాంతినికేతన్ పాఠశాలలో జరిగిన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తాతలు, అమ్మమ్మలు, నానమ్మలతో పిల్లలకు ఉండే అనుబంధం గురించి వివరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.బాలేష్, పాఠశాల డైరెక్టర్ గోపు సునీత, చైర్మన్ గోపు జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుగంధిని తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తీన్మార్ మల్లన్న అరెస్టు దారుణం

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేతలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: క్యూ న్యూస్ నిర్వాహకుడు తీన్మార్ మల్లన్న అలియాస్ నవీన్ కుమార్, విలేకరి తెలంగాణ విఠల్‌ను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేయడాన్ని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేతలు జీవన్‌కుమార్, భుజంగరావు, డాక్టరు తిరుపతయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఓ ప్రకటనలో వారు మాట్లాడుతూ.. రెండ్రోజుల కిందట మల్లన్న నిర్వహిస్తున్న క్యూ న్యూస్ యూ ట్యూబ్ ఛానల్ ఆఫీస్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి సిబ్బందిపై చేయి చేసుకోవడం దారుణమన్నారు. మల్లన్న ప్రభుత్వాన్ని విమర్శించటంతో పాటు ప్రభుత్వ పాలసీలపై భిన్నాభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నందుకే పోలీసులు కక్ష పూరితంగా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు స్వస్తిపలికి భావ ప్రకటన స్వేచ్ఛకు భంగపరిచేలా వ్యహరించకూడదని వారు పేర్కొన్నారు.

నేడు మంత్రి మల్లారెడ్డి పర్యటన

మేడ్చల్: జాతీయ పంచాయతీ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుండగా మంత్రి మల్లారెడ్డి పాల్గొని ఎంపికైన గ్రామాలకు అవార్డులు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొనాలని ఆమె కోరారు.

'కల్మషం లేని మంత్రి మల్లారెడ్డి' పాటల సీడీ ఆవిష్కరణ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండకింది ప్రసాద్ ఆధ్వర్యంలో గాయకుడు వెంకటాచారి రచించిన 'కల్మషం లేని మంత్రి మల్లారెడ్డి, కష్టపడి పైకి వచ్చిన కార్మికుడు మంత్రి మల్లారెడ్డి' అనే పాటల సీడీని బుధవారం మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు ఆశాకుమారి, మేకలలితయాదవ్, వేణు, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, నాయకులు మెట్టు వెంకన్న, సాధిక్, కృష్ణగౌడ్, నర్సింహా, చారి, రాహుల్, శ్రీను, అశోక్‌గౌడ్, బాల్‌రెడ్డి, అమర్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.


సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

వ్యాపార సముదాయం ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ కళాశాల ఎదురుగా ఎస్ఆర్ స్నాక్స్, ఔట్‌లెట్ హోల్‌సేల్ షాప్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి ముఖ్యఅతిథులుగా బుధవారం హాజరై ప్రారంభించారు. నిర్వాహకులు మహేశ్‌రెడ్డి, జుబేర్, లక్ష్మారెడ్డి, శ్వేతారెడ్డి, నాయకులు జంగయ్యయాదవ్, విజయ్‌ముదిరాజ్, ఫయూమ్ పాల్గొన్నారు.


షాప్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ప్రారంభానికి సిద్ధంగా శిల్పానగర్ కాలనీ పార్కు

కీసర: నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్‌కాలనీలోని సుమారు ఎకరం స్థలంలో గల పార్కుని సుమారు రూ.కోటి మున్సిపల్ నిధులను వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్, పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ పలు రకాల మొక్కలు, పూల మొక్కలను నాటడంతో పాటు సమీప ప్రజలు సేద తీరేందుకు వీలుగా గదులను కూడా నిర్మించారు. పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు కూడా చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డిలు తెలిపారు. సుందరంగా తీర్చిదిద్దిన ఈ పార్కును త్వరలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు చెప్పారు.







మేడ్చల్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు..

మోక్షమెన్నడో?

శంకుస్థాపనకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- వారాంతపు సంతలపైనే ఆధారపడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

మేడ్చల్: గజ్వేల్, సిద్దిపేట పట్టణాల్లో మాదిరిగా వెజ్, నాన్‌వెజ్, ఇతర వస్తువుల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. ఇతర ప్రాంతాల పాలకులు గజ్వేల్‌కు వెళ్లి మార్కెట్లను చూసి వస్తున్నా.. అవి కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలు, ఐదు మండలాలు, 6 లక్షల వరకు జనాభా ఉన్నా.. ఒక్క ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇప్పటి వరకు లేకుండా పోయింది. మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ మార్కెట్ కోసం శంకుస్థాపన చేసినా దానికి ముందడుగు పడలేదు.


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం ప్రతిపాదించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ స్థలం

మూడేళ్ల క్రితం తీర్మానం చేసినా...

మేడ్చల్‌లో 14వ వార్డులోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్(డాగ్‌బంగ్లా) స్థలంలోని రెండున్నర ఎకరాల్లో సంపూర్ణ వసతులతో ఇంటిగ్రెటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో మూడేళ్ల క్రితం తీర్మానం చేశారు. మార్కెట్ ఏర్పాటు కోసం రూ.5.50 కోట్లు మంజూరీ చేసి రూ.2కోట్లు మున్సిపల్ వాటా కింద ఖర్చు చేసి మార్కెట్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరీ చేసి నిర్మాణం కోసం టెండర్‌ను పిలిచి ప్రక్రియను పూర్తి చేసినా పనులు మాత్రం మొదలు కాలేదు. గతేడాది మంత్రి మల్లారెడ్డి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కోసం శంకుస్థాపన చేసినా అది శిలాఫలకంకే పరిమితమైంది.

వారాంతపు సంతలపైనే ఆధారం..

మేడ్చల్ పట్టణంలో కూరగాయలు, ఆకుకూరలు, పువ్వులు, పండ్లు ఇతర నిత్యావసరాల సామగ్రి కోసం ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో ప్రజలు వారాంతపు సంతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. కూరగాయల మార్కెట్ కింది బస్తీలో ఉన్నా అది సరిపోను లేదు. పువ్వులు, పండ్లు రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఒక్కో వస్తువు కోసం ఒక్కో ప్రాంతానికి తిరగాల్సి వస్తోంది. వివిధ కాలనీల్లో వ్యాపారస్థులు వారాంతపు సంతలు నిర్వహిస్తూ కూరగాయలు, ఆకుకూరలు, ఇతర వస్తువులు విక్రయిస్తున్నారు. వీటిపైనే పట్టణ ప్రజలు ఆధారపడుతున్నారు.

సంతల్లో సమస్యలు...

వారాంతపు సంతల వల్ల కాలనీల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాలనీలో ప్రధాన రోడ్లపై వ్యాపారులు స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతో సంత రోజు కాలనీవాసులు సాయంత్రం వేళల్లో వాహనాలపై బయటకు రావాలంటే ఇబ్బందికరంగా మారుతుంది. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం సైతం రాలేని విధంగా రద్దీ ఉంటుంది. దీంతో ఈ ప్రాంతంలో చైన్ స్నాచింగ్, జేబు దొంగతనాలు కూడా ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

స్థలం సమస్య సాకుతో కాలయాపన...

స్థల సమస్యను సాకుగా చూపుతూ మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఆ స్థలం ఆర్‌అండ్‌బీ శాఖ వారిదా? ఎన్‌హెచ్ఏఐ వారిదా? స్పష్టత లేదు. ఏ శాఖకు చెందిన స్థలమైనా ప్రభుత్వ స్థలం కావడంతో సేకరించడం సులువే.. అయినా మార్కెట్ ఏర్పాటు విషయంలో పాలకులు శ్రద్ధ కనబర్చకపోవడంతో ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.

వృథాగా రైతు బజార్..

లక్షల రూపాయలు వెచ్చించి మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన రైతు బజార్ ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. మొదట్లో రైతులు తాము పండించిన కూరగాయలు విక్రయించేలాగా రైతు బజార్ ఏర్పాటు చేసినా వారి నుంచి స్పందన లేకపోవడంతో దాంట్లో ఒక షెడ్డులో నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేశారు. మిగతా రెండు వైపులా ఉన్న షెడ్లు వృథాగా ఉన్నాయి. షెడ్ల మధ్యలో ఖాళీ స్థలాన్ని నాయకులు, కాలనీల వాసులు పార్కింగ్ స్థలంగా ఉపయోగిస్తున్నారు. పట్టణం మధ్యలో నిరుపయోగంగా ఉండటంతో మద్యం బాబులకు రాత్రి సమయాల్లో అడ్డాగా మారింది. తాత్కాలికంగా వెజ్ మార్కెట్ ఏర్పాటు చేస్తే కొంత మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది.


వృథాగా ఉన్న రైతు బజార్

మార్కెట్లో వసతులు కరువు...

మేడ్చల్ గ్రామ పంచాయతీ ఉన్న సమయం నుంచి కింది బస్తీలోని చెరువు వద్ద చిన్న మార్కెట్ ఉంది. అక్కడే కూరగాయలు, చేపలు విక్రయించే మార్కెట్ ఉన్నా.. తాత్కాలిక షెడ్లు ఉండటం, ఎలాంటి వసతులు లేకపోవడంతో అటు వైపు వ్యాపారులు, వినియోగదారులు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. వారాంతపు సంతలు ప్రతీ కాలనీలో ఉండటంతో పట్టణవాసులు వాటిపైనే ఆధారపడుతున్నారు.


వారాంతపు సంతలో జన సందోహం